

నవరత్నాలతో అన్ని వర్గాల్లో వెలుగులు : డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిగురుకోట గ్రామ సచివాలయ పరిధిలోని మీగడాపురంలో గురువారం గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, జెడ్పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, పార్టీ నాయకులు బొర్రా శేషు, బేతపూడి వెంకటరమణ, కె.విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, రాచూరి కుమార్, పేర్నిపృధ్వి, దివి సతీష్, బి.కిషోర్, కె.ప్రవీణ్, సాయి, మరీదు హనుమంతు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కల్లంలోనే కొనుగోళ్లు.. ఆచరణ సాధ్యమేనా..!

ప్రొక్యూర్మెంట్ విధానంలో ధాన్యం కొనుగోలు

దళారులను అరికట్టడం సాధ్యమేనా

సర్కార్ ప్రణాళికలు ఆచరణకు సాధ్యం కాదంటున్న మిల్లర్లు

తేమశాతం నిబంధనల సడలించాలి : రైతులు

మద్దతు ధర కల్పించి, సకాలంలో సొమ్ములివ్వాలని డిమాండ్



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొత్త సీసాలో పాత నీరు పోసిన విధంగా ఉంది సర్కారు తీరు. ఏటా ఇబ్బందులతో మొదలవుతూ.. ఇబ్బందులతోనే ముగుస్తున్న ధాన్యం కొనుగోలు విషయంలో సర్కారు పాతమాటనే కొత్తగా చెప్పుకొచ్చింది. రైతు కల్లంలోనే ధాన్యం కొనుగోలు విషయంలో దళారుల, మిల్లర్ల పాత్ర లేకుండానే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రొక్యూర్మెంట్ పద్ధతిలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంటూ కొత్తగా చెప్పుకొచ్చింది. కానీ ఎప్పటిమాదిరిగానే ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో వారి ఖాతాల్లో నగదును జమ చేస్తామని చెప్పడం గమనార్హం.

ఏటా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరగక ముందే రైతుల వద్దనున్న ధాన్యాన్ని దళారులు, పలువురు మిల్లర్లు తమ అడ్డాలోకి తరలించుకుపోవడం ఆనవాయితీగా వస్తోంది. సర్కార్ చెప్పిన మాదిరిగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు పడినా వాటిని తీసుకునే హక్కు వారికి ఉండదన్నది అందరికీ తెలిసిన విషయమే. ఎందుకంటే అప్పటికే నగదు విత్ డ్రా ఫారంపై రైతు సంతకం/వేలిముద్ర తంతు పూర్తయి పాస్బుక్తో సహా దళారులు, పలువురు మిల్లర్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఇదంతా ఒక ఎత్తయితే ఏటా మళ్లీమళ్లీ మిల్లర్ల వద్దకే చేరుతున్న బియ్యాన్ని మరపట్టి తిరిగి లెవీగా సర్కారుకే మిల్లర్లు చేరవేస్తున్నారు. రైతుల వద్దనుంచి సేకరించిన ధాన్యాన్ని ఆరునెలల వరకూ నిల్వ ఉంచి ఆ తర్వాత వాటిని ఆడించి బహిరంగ మార్కెట్లో అధికధరకు విక్రయించుకుంటూ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా సర్కారుకు తెలిసే జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినిట్లు వ్యవహరిస్తుంది. ఈ ఏడాది 3.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దానికిగానూ ప్రొక్యూర్మెంట్ పద్ధతిలో సేకరించడానికి జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల ఆఖరి నిమిషం వరకూ ఏ రైతుకు చెందిన ధాన్యం ఏ మిల్లుకు చేరుతుందో? తెలియదని, దానివల్ల రైతులు దళారుల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. దీనికి సంబంధించి ప్రత్యేకసెల్ను ఏర్పాటు చేసి ప్రత్యేకించి అధికారుల బృందాన్ని కూడా నియమించారు. ఈ ధాన్యం సేకరణకుగానూ మిల్లర్ల వద్ద 50 లక్షల గోనెసంచులు, మరో పదిలక్షలు పౌరసరఫరాల వద్ద సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కొనుగోళ్లు పూర్తయ్యేవరకూ ఎప్పటికప్పుడు సీఎం కార్యాలయ వర్గాలు పరిశీలిస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. రైతుల నుంచి ధాన్యం నేరుగా వే బ్రిడ్జికి వెళుతుందని అక్కడ నుంచి ర్యాండమ్ పద్ధతిలో కేటాయించిన రైస్ మిల్లుకు ధాన్యం చేరుతుందని, మిల్లర్లకు సంబంధించి బ్యాంకు గ్యారంటీ విషయంలో ఉన్నతస్థాయి అధికారులతో చర్చించామని, సానుకూల దృక్పథం వచ్చిందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. అలాగే తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలని, పొలంలో రైతు ఆరబెట్టిన ధాన్యాన్ని సేకరించి వే బ్రిడ్జికి తీసుకువెళ్లి తూకం వేసి ఎఫ్టిఒ జనరేట్ చేస్తారు. అక్కడ నుండి ఆయా రైస్ మిల్లులకు ధాన్యం రవాణా అవుతుంది. ఈ విషయంలో వాలంటీర్ రైతు సహాయకుడిగా పనిచేస్తారు. అయితే ఇప్పటికే ప్రతీ మండలంలో వే బ్రిడ్జిలను అధికారులు గుర్తించారు.

నిబంధనలు సడలించాలి

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంలో కొన్ని నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా పరిణమించాయి. తేమశాతం 17 మించకుండా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదిసాధ్యం కాదు. ఈ నిబంధనను సడలించాలని రైతులు కోరుతున్నారు. అలాగే ప్రతీసారి ధాన్యం కొనుగోలులో రైతులను గోనె సంచుల కొరత వెంటాడుతోంది. ఈ సారైనా సరిపడు గోనె సంచులను రైతులకు అందించాలని కోరుతున్నారు.

సకాలంలో సొమ్ములు అందేనా?


ధాన్యం సొమ్ము చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన ఉండటం లేదు. ధాన్యం సేకరించిన 21 రోజుల్లో సొమ్ములను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. కానీ ఇది ఎక్కడా కూడా అమలుకావడం లేదు. నెల తరబడి ధాన్యం సొమ్ములు పెండింగ్లో పెట్టిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఎప్పటిలాగానే ఈ ఖరీఫ్లోనూ 21 రోజుల్లో సొమ్ములు కచ్చితంగా జమ చేస్తామని చెబుతున్నారు. ఏది ఏమైనా రైతులు అమ్మిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి సకాలంలో సొమ్ము చెల్లించాలని కోరుతున్నారు.

దళారులను నిరోధించగలరా..?

అయితే ఇదంతా బాగానే ఉన్నా దళారులను నిరోధించగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా అధికారులు ఈ ధాన్యం కొనుగోలు విషయంలో ఎన్ని ప్రకటనలు చేసినా దళారులు మాత్రం తమదైనరీతిలో రైతులను నిలువునా మోసం చేస్తున్నారనే విషయం తెలిసిందే. వాతావరణం రైతులు సాగు చేయడానికి అధికమొత్తంలో వడ్డీకి పెట్టుబడిని తీసుకొస్తుంటారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేయడంలో జాప్యం జరుగుతుండడం పరిపాటిగా మారుతోంది. దీంతో రైతులు అందినకాడికి దళారులకు అమ్ముకుని ముందుగానే డబ్బులు తీసుకుని అప్పులు చెల్లించుకోవడం పరిపాటిగా మరుతోంది. మరి ఇలాంటి తరుణంలో ఈసారి అటువంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే రైతులకు అనుకున్న సమయానికి నగదును వారి ఖాతాల్లో జమ చేయాలని పలువురు చెబుతున్నారు.

ధాన్యం సేకరణలో నూతన విధానం.. నష్టం

ధాన్యం సేకరణలో నూతన విధానం వల్ల సొసైటీలు నష్టాల్లోకి వెళ్తాయని ఇటీవల జరిగిన జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం పేర్కొంది. సహకార సంఘాలు నష్టాల్లోకి వెళ్తాయని, కొత్త నిబంధనల వల్ల కార్యదర్శికి పూర్తి బాధ్యత ఇవ్వడంతో ఏదైనా పొరపాటు జరిగితే పోలీసులు కేసులు బనాయిస్తారని, కార్యదర్శులు ఆందోళన చెందుతారని వివరించింది. అలాగే నిర్మించిన గోదాములు 30 సంవత్సరాల్లో 30 వాయిదాల్లో బాకీ తీర్చాలి, తరువాత గోదాముము ప్రభుత్వానికి అప్పగించాలి, ఈ గోదాములపై సహకార సంఘాలకు ఏ విధమైన హక్కులుండవు ఇది కేవలం సహకార సంఘాలను నష్టాల్లోకి నెట్టి వేయడం తప్ప మరొకటి కాదని తెలుస్తోంది.



రిలే దీక్షలో నిర్వాసితులు

నిర్వాసితుల గోడు పట్టని ప్రభుత్వాలు

కొనసాగిన పోలవరం నిర్వాసితుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని నిర్వాసితుల సంఘం నాయకులు వై.సాయికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం నాయకులు సాయికిరణ్ మాట్లాడుతూ మాధవరం, కొండిన్నముక్కి, యల్లప్పగూడెం, బెస్తగూడెం గ్రామాలను 41.15 కాంటూర్లో చేర్చాలని, గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని, నాలుగు రోజుల నుండి తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు నిర్వాసితులు చేస్తున్నప్పటికీ కనీసం అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోకపోవడంతో నిర్వాసితుల పట్ల ప్రభుత్వానికి ఎంతప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. జులైలో వచ్చిన గోదావరి వరదలకు మునిగిన గ్రామాల్లో మొదటి గ్రామాలు మాధవరం, కొండిన్నముక్కి, బెస్తగూడెం, యల్లప్పగూడెం గ్రామాలు అయితే అవి 41.15 కాంటూర్లో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 41.15 కాంటూర్లో ఈ నాలుగు గ్రామాలను చేర్చి పరిహారం వెంటనే ఇవ్వాలని, వరదల వల్ల పూర్తిగా పాడైన రహదారులను వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో నిర్వాసితుల సంఘం నాయకులు యర్రం సాయికిరణ్, కోట రామలక్ష్మి, మేడిపల్లి బాబు, నిర్వాసితులు కోట మోహన్రావు, కోట అలివేలు, మేడిపల్లి సాయమ్మ, గాలేటి లక్ష్మి, సారంగి కృష్ణ, మోటా కాంతమ్మ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అమరజీవి ఐద్వా నేత విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు

మహిళల సమస్యలపై నిరంతరం పోరాడిన నేత అమరజీవి ఐద్వా నేత జి.విజయలక్ష్మి అని సిఐటియు నాయకులు పి.కిషోర్ కొనియాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఐద్వా పూర్వపు కార్యదర్శి జి.విజయలక్ష్మి రెండో వర్ధంతి సభ ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిఐటియు నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ మహిళల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఐద్వా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీకి సుదీర్ఘకాలం కార్యదర్శిగా పనిచేశారని గుర్తు చేశారు. ఆమె పని చేసిన కాలంలో జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న మద్యం, తాగునీరు, తదితర సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. మహిళల సమస్యలు పరిష్కరించడం కోసం ఐద్వా జిల్లా కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న మహిళా ఉచిత న్యాయ సహాయ కేంద్రం నిర్వహించడంలో కీలకపాత్ర వహించారన్నారు. మహిళలపై ఎక్కడ ఆచ్యాచారాలు, దాడులు జరిగిన వెంటనే స్పందించి ఆందోళన చేపట్టే వారని తెలిపారు. అలాంటి మహిళా నేతను కోల్పోవడం బాధాకరమన్నారు. విజయలక్ష్మి మృతి ఐద్వా జిల్లా ఉద్యమానికి తీరని లోటన్నారు. ముందుగా విజయలక్ష్మి చిత్రపటానికి హైమావతి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా కార్యకర్తలు విజయలక్ష్మికి జోహార్లు అర్పిస్తూ ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.శారద, టి.సుకన్య, రమణమ్మ, ఫాతిమా, భాగ్యలక్ష్మి, సత్యవతి, అనిత పాల్గొన్నారు.

170 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఖరీఫ్ పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన 24 గంటల్లో 170 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు. గురువారం ఉదయం నుంచి జాయింట్ కలెక్టర్ పి.అరుణ్బాబు, ఏలూరు ఆర్డిఒ పెంచల కిషోర్ నారాయణపురం సొసైటీ, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రాల వద్దే ఉండి కొనుగోళ్లను పరిశీలించారు. జిల్లా అధికారులు దగ్గరుండి రైతుల నుంచి శాంపిళ్ల సేకరణ, తేమ శాతం పరీక్షలు, గోనె సంచులు ఇవ్వడం, ట్రక్కు షీటు విడుదల చేయించడం వంటి శాఖాపరమైన పనులను పర్యవేక్షణ చేయడంతో ఎట్టకేలకు ఉంగుటూరు రైతుభరోసా కేంద్రం నుంచి 170 టన్నుల ధాన్యాన్ని గణవపరం, భీమడోలు రైస్ మిల్లులకు పంపించారు. నారాయణపురం సొసైటీల్లో రైతులనుద్దేశించి అధికారులు మాట్లాడుతూ అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంక లేదన్నారు. హమాలీ ఛార్జీలు, ట్రాన్స్పోర్టు కిరాయిలు సైతం ధాన్యం బిల్లులతో పాటు 21 రోజుల్లో చెల్లించేలా అన్ని చర్యలూ తీసుకున్నామని జెసి అరుణ్బాబు పేర్కొన్నారు.



మాట్లాడుతున్నఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

చట్టాల అమలుతోనే గిరిజనుల అభివృద్ధి

ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో మాతృభాష విద్యావాలంటీర్లకు రెండో రోజు శిక్షణ తరగతుల్లో 'గిరిజన చట్టాలు - ఆవశ్యకత' అంశంపై సీతారాం మాట్లాడారు. ఐదు, ఆరు షెడ్యూల్డ్ ప్రాంతాన్ని భారత రాజ్యాంగం గిరిజనులకు కేటాయించిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రధానంగా 1917, 1959 సంవత్సరాల్లో భూ బదలాయింపు చట్టాలు ఉన్నాయన్నారు. 1970లో 1/70 చట్టం తీసుకొచ్చిందని ఈ చట్టం ఆధారంగా 1970 తర్వాత భూముల కొనుగోలు, అమ్మకాలు ఆపాలనేదే చట్టం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 1993లో గిరిజనులకు కుల ధృవీకరణపత్రం జారీకి చట్టం చేస్తూ కొన్ని కమిటీలను నియమించిం దన్నారు. సహజ వనరులు, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయల కల్పన, గిరిజన సంస్కృతి న్యాయ వ్యవస్థలపై కమిటీలు పని చేయాలని చట్టం స్పష్టంగా చెబుతుందన్నారు. ఎస్టి అత్యాచార నిరోధకచట్టం గిరిజనులను కులం, లింగ వివక్షతో దుర్భాషలాడిన వారిపై చర్యలు తీసుకునేలా చట్టం రూపొందించారని వివరించారు. అనాదిగా వెట్టిచాకిరీ, దోపిడీ, అన్యాయాలకు బలైన గిరిజనుల అభివృద్ధికి స్వాతంత్ర్యం అనంతరం ఆయా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం దేశావ్యాప్తంగా గిరిజన హక్కులపై దాడులు చేస్తుందని విమర్శించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయకుండా నీతి అయోగ్ను ప్రవేశ పెట్టడం బిజెపి దుర్మార్గపు చర్య అని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజనుల చట్టాలను సవరిస్తూ గిరిజన హక్కులను కాలరాస్తున్నారన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఈ శిక్షణా తరగతులకు మాతృభాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుంజా నవీన్, కార్యదర్శి కురసం పృధ్వీరాజు ప్రిన్సిపల్గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు, మాతృ భాషా విద్యా వాలంటీర్లు సరియం రామసీత, సరియం భవాని, మొడియం స్వాతి, మడకం సీతామహాలక్ష్మీ, కరక వెంకటలక్ష్మి, ధర్ముల రాధా, పాయం దుర్గా ప్రియాంక, కూరంశెట్టి లక్ష్మీప్రసన్న, కురసం గీతాంజలి, సోదే సుమలత, మేఘన పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో 12 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం వలసపల్లి ప్రమీల జ్ఞాపకార్థం వారి భర్త విఆర్వి.సత్యనారాయణ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ జి.చైతన్య కిరణ్, ఎ.సూర్యనారాయణ, కెవి.రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నూజివీడు సబ్ కలెక్టర్

ప్రభుత్వ భవనాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు వెంటనే పూర్తి చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ బసవరాజు, అచ్యుత సత్యనారాయణతో పాటు పంచాయతీరాజ్ ఎఇ, ఆర్డబ్ల్యుఎస్ ఎఇలతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసాకేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్ల భవనాల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న ఇసుకకు మైనింగ్ శాఖాధికారుల అనుమతుల ద్వారా వేలం పాట నిర్వహించడం కాని, లేదా నాడు-నేడు పనులు జరుగుతున్న ప్రభుత్వ భవనాలకు తోలుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండలంలోని ఆరు డిజిటల్ గ్రంథాలయాలపై నిర్మాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముసునూరు, రమణక్కపేటలో ఇప్పటికే పనులు జరుగుతున్నాయని, మిగతావి స్థలాలు సేకరించి నివేదిక పంపిస్తామని తెలిపారు.



మౌనం పాటిస్తున్న అధికారులు

ఘనంగా ఆటవీ అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ అటవీ అమరవీరుల దినోత్సవం స్థానిక అశోక్ నగర్లోని జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర దామా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర దామా మాట్లాడుతూ అటవీ సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా నవంబర్ పదో తేదీన అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు అటవీ డివిజన్ పరిధిలో అటవీ సంరక్షణకు 23 మంది తమ ప్రాణాలను అర్పించారని, ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ వారికి నివాళులర్పించారు. వారి ఆత్మ శాంతి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయం నుంచి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్వికె.కుమార్, టెరిటోరియల్, వన్యప్రాణి యాజమాన్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించాలి

ఎంఎల్సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - భీమడోలు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న షేక్ సాబ్జీ

ధాన్యం కొనుగోళ్ల విషయమై ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారాయని ఎంఎల్సి షేక్ సాబ్జీ అన్నారు. భీమడోలు మండలంలో ఆయన గురువారం పర్యటించారు. దీనిలో భాగంగా గుండుగొలను వద్ద రోడ్డుపై రైతులు ధాన్యాన్ని ఆరబోసిన రాసులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ మాసూళ్లు మొదలై పది రోజులు దాటినప్పటికీ ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానందువల్ల రైతులు తమ ఇబ్బందుల దృష్ట్యా తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ధాన్యం కొనుగోలుకు ఇ-పంటలో నమోదు నిబంధన, సంచులు ఇవ్వకపోవడం, ఖర్చులను తొలుత రైతులే భరించాలన్న షరతులు రైతులకు ఇబ్బందికరంగా మారాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన సహకార సంఘాలకు మూడేళ్లుగా కమిషన్ ఇవ్వలేదని, రైస్ మిల్లర్లు ధాన్యం ఆడించిన కమిషన్లు చెల్లించని కారణంగా వారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో తలెత్తే అన్ని సమస్యలను రైతు భరోసా కేంద్రాలు పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తాయని ప్రభుత్వం తెలిపిందన్నారు.. కానీ రైతు భరోసా కేంద్రాలు ధాన్యం కొనుగోలు విషయమై కేవలం సమాచార మధ్యవర్తులుగా మాత్రమే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయమై నాటి ఇందిరా క్రాంతి పథం-నేటి రైతు భరోసా కేంద్రాల మధ్య తేడా లేకుండా పోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్విడి.ప్రసాద్, ఉపాధ్యక్షులు ఆర్.లింగరాజుతో పాటు కెవిపిఎస్ భీమడోలు మండల కన్వీనర్ టి.సుమన్బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని బయటకు తీసుకొచ్చేందుకు జగనన్న క్రీడా సంబరాలు ప్రారంభించినట్లు ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన జగనన్న క్రీడా సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైనల్స్లో గెలిచే జట్టుకు రూ.లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులు పట్టుదలతో, నమ్మకంతో ఉండాలన్నారు. గెలుపు మీద దృష్టి పెట్టి నైపుణ్యాన్ని బయటకు తీసి నియోజకవర్గం పేరు రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, వెంపా కృష్ణ, మిర్యాల దిలిప్, ఆత్కూరి సుబ్బారావు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వేణు, సుధాకర్, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.



క్రీడల్లో పాల్గొన్న ఎంఎల్ఎ ఎలిజా


విఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రమణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలో ముదినేపల్లి విఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ జెవి.రమణ గురువారం తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేది బుధవారం ఉయ్యూరులో నిర్వహించిన పోటీల్లో డిస్క్ త్రోలో టి.పరిపూర్ణ ప్రథమ స్థానం, షార్ట్పుట్లో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. జావిలింగ్లో ఎ.మౌనిక ద్వితీయ స్థానం, ఎబి వహీదా తృతీయ స్థానం సాధించినట్లు ఆయన చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నాడు నేడు నిధులు రూ.80 లక్షలతో నిర్మించిన అదనపు తరగతులను గురువారం ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. రూ.25 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలల అభివృద్ధికి నాడునేడు పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు.

చింతలపూడి : నాడు-నేడు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలకు వరమని ఎంపిపి రాంబాబు, రేచర్ల సర్పంచి రామకృష్ణ అన్నారు. మండలంలోని రేచర్ల పంచాయతీలో రెండో మైలు స్కూలులో సుమారు రూ.ఐదు లక్షలతో అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మౌనిక, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రసాయనాలు పిచికారీ చేస్తున్న సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిహెచ్‌సి వైద్య అధికారిని డాక్టర్ బి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని కన్నాపురం ఎస్‌డబ్ల్యూ హాస్టల్‌లో రసాయనాల పిచికారీ, యాంటీ లార్వా నివారణ చర్యలు పోలవరం సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లోకల్ స్ప్రేలింగ్ యాంటీ లార్వా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ నాగమణి, ఎంపిహెచ్ఇఒ శ్రీరామరాజు, ఆరోగ్య కార్యకర్త మంజునాథ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

కార్యకర్తలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రగడవరంలో గొల్లగూడెంలో టిడిపి కార్యకర్త నరదలా నాగేశ్వరరావు భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపిటిసి మాజీ సభ్యులు కనుమతరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బిసి సెల్ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారితో పాటు గద్దె శివకోటేశ్వరావు, తోట సాయిబాబు, అంజయ్య ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

రెండు వేర్వేరు కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పూళ్ల గ్రామానికి చెందిన కొండేటి కిషోర్ తన రెండు సెల్‌ఫోన్లను ఛార్జింగ్‌లో ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అనుమానితులుగా ఉన్న బంగా శ్రీను, వర్రే బాలకృష్ణపై పోలీసులు నిఘా ఉంచి ఆధారాలు సేకరించారు. గురువారం వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

దేవుడు పిలుస్తున్నాడని..

ప్రజాశక్తి - చింతలపూడి

దేవుడు పిలుస్తున్నాడని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చింతలపూడిలో చోటు చేసుకున్నాడని చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. చింతలపూడికి చెందిన సున్నపు గౌరీశంకర్ (36) కొంతకాలంగా ఆధ్యాత్మికంగా ఉంటున్నాడని, ఈ క్రమంలో తనను దేవుడు పిలుస్తున్నాడని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



వివరాలు తెలుపుతున్న పోలీసులు

బిల్డర్ కిడ్నాప్ విఫలయత్నం
ఐదుగురు అరెస్టు


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరానికి చెందిన బిల్డర్ ఈడ్పుగంటి నవరాజ్‌ను కిడ్నాప్‌నకు యత్నించినవారిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి రెండో పట్టణపోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి పైడేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన బిల్డర్ ఈడ్పుగంటి నవరాజ్, జంగారెడ్డిగూడెం పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన సింగంశెట్టి సత్యరాజు అలియాస్ దత్తిరాజు మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఇరువురి మధ్య ఇటీవల ఒక ప్రాపర్టీ విషయంలో తీవ్రస్థాయిలో విభేదాలు నెలకొన్నాయి. తనకు రావాల్సిన బకాయిల విషయంలో గొడవలు చోటు చేసుకోవటంతో సత్యరాజు ఎలాగైనా డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో నవరాజ్‌ను కిడ్నాప్ చేసేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఈ నెల ఎనిమిదో తేదీన ఏలూరు డీమార్ట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తోన్న షాపింగ్‌మాల్ భవనం వద్ద నవరాజ్‌ను ఐదుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. కిడ్నాప్ ప్లాన్‌లో కీలక నిందితుడు సత్యరాజుపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉండగా, అతనిపై ఆయా స్టేషన్లలో 12కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాల మేరకు ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి పైడేశ్వరరావు పర్యవేక్షణలో ఇన్‌ఛార్జి సిఐ కెవిఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసి ఈ కేసులో పోలీసులు పూర్తిస్థాయి పురోగతిని 48 గంటల్లో సాధించారు. పోలీసులు ఈ ఐదుగురు నిందితులతో పాటు ప్రధాన పాత్రధారి సత్యరాజును అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, బైక్, ఐదు సెల్‌ఫోన్లు, రూ.నాలుగు వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్టు చేయటంలో కీలకపాత్ర పోషించినవారిని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ప్రత్యేకంగా అభినందించారు.

సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - గణపవరం

ధాన్యాన్ని సొసైటీ ద్వారా కొనుగోలు చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైస్ మిల్లర్లకి అందిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కె.మంజుభార్గవి అన్నారు. గణపవరం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సంబంధించిన అంశాలపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 25 గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారిగా సిఇఒ కెవిఎస్ఆర్ రవికుమార్ నియమితులైనట్లు చెప్పారు. వ్యవసాయ అధికారి ఎ.ఐ మాట్లాడుతూ మండలంలో 110400 ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధం చేశామని చెప్పారు. తహశీల్దార్ ఎం.సన్యాసిరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంట దళారుల చేతికి అందకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు, డిటి శేఖర్ సొసైటీ అధ్యక్షులు గ్రామాల వాలంటీర్లు బెక్కెళల అసిస్టెంటు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంజుభార్గవి

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పేదలు, అన్నార్తులకు సాయం చేయడం ద్వారా మానసిక సంతృప్తి లభిస్తుందని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి, ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఎన్ఎం) నర్సింగ్ శిక్షణ పొందుతున్న రాపాక ఆశకు ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సాయి హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో డిఇఒ గంగాభవాని చేతుల మీదుగా రూ.పది వేల ఆర్థిక సాయం గురువారం అందించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పేదలకు సాయం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థికి సాయం చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు, ఉపాధ్యాయులు జి.మోహనరావు, జి.శ్రీనివాసరావు, డికెఎస్-ఎస్.ప్రకాశరావు, ఎస్.ఆదినారాయణ, ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఆశకు ఆర్థిక సాయం అందిస్తున్న గంగాభవాని

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరును కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా కుష్టువ్యాధి నివారణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కుష్టువ్యాధి గుర్తింపు, నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రం, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కుష్టువ్యాధిని సమాజం నుంచి తరిమివేసి, కుష్టువ్యాధి రహిత జిల్లాగా రూపొందించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టువ్యాధి గుర్తింపు, నిర్మూలన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కుష్టువ్యాధిని మల్టీ డ్రగ్ థెరపీ విధానం ద్వారా పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎండిటి మందులు పూర్తి ఉచితంగా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రత్నకుమారి, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జ్యోతి పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలని తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ వైసిపి కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు సంకు కొండ, లబ్ధిదారులు కలిసి తహశీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంకుకొండ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు కట్టినప్పుడు 28 కుటుంబాలకు చెందిన పట్టాలు తీసుకుని వెనక్కి ఇవ్వలేదని కొయ్యలగూడెం ఉప్పరపేటలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒటిఎస్‌లో కూడా వారి పేర్లు నమోదు కాలేదని తమకు పట్టాలు ఇప్పించాలని లబ్ధిదారులు కోరారు. సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారులకు సమస్య వివరించి పట్టాలు వచ్చేందుకు కృషి చేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీరామ్మూర్తి, పోతుల దుర్గ, ఎన్.కాంతమ్మ, నాగమణి పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారులు

వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురం తాగునీటి అవసరాలకు రూ.1.67 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ ఎలిజా తెలిపారు. శ్రీనివాసపురంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.67 కోట్లతో 60 వేల లీటర్ల ట్యాంక్, ఇంటింటికి కుళాయి నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, వైసిపి నాయకులు వామిశెట్టి హరిబాబు, సభా అధ్యక్షులు పోల్నాటి శ్రీనివాసరావు, వార్డు నెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ ఎలిజా

బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వినియోగదారులు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలని ఆ బ్యాంక్ ఛైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నూతన శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలు రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 234 శాఖలతో విస్తరించి ఉందని రూ.27 లక్షల ఖాతాదారులను కలిగి ఉందని తెలిపారు. డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ జిఎస్ఎన్.సతీష్‌కుమార్, మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కామేశ్వరరావు

ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్
భయాందోళనలో స్థానికులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని అన్నవరం రోడ్డులో కాలేజీ మలుపు వద్ద విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ స్తంభానికి ఐదు అడుగుల ఎత్తులో ఉండాల్సిన విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ కేవలం భూమికి అడుగు ఎత్తులో కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్‌ను స్తంభానికి ఎత్తులో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్‌బాక్స్

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి : టిడిపి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని దేవపూడిలో గురువారం టిడిపి ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు పెరిగిన ధరలతో సతమతమవుతున్నారన్నారు. ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారన్నారు. ఇక వైసిపి గారడీ మాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజల తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, తెలుగుయువత ఉపాధ్యక్షులు దావు నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారతరత్న మౌలానా అబుల్ కలామ్ జయంతి సందర్భంగా ఈ నెల 11వ తేదీ శుక్రవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని పుర ప్రముఖులు, జిల్లా అధికారులు, మైనారిటీ పుర ప్రముఖులు అందరూ హాజరు కావాలని కోరారు.

చిగురుకోటలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోటలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన భారీగా నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సమారాధనలో పది వేల మంది పాల్గొన్నారని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ తెలిపారు.

12న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 12వ తేదీన జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించే ఉద్దేశంతో ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, రాజీ యోగ్యమైన క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదా, వాహన ప్రమాద, బ్యాంకు వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, శ్రీ రామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ అన్ని రకాల ఇపిలు, మున్సిపల్ ట్యాక్స్‌లకు సంబంధించిన కేసులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయాలు వివిధ రూపాల్లో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని పూళ్ల సర్పంచి దాయం సుజాతప్రసాద్ కోరారు. పూళ్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు డిఎన్‌బి.అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను సర్పంచి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా 14న చిత్రలేఖన పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, 16న వక్తృత్వ పోటీలు, 17న కవి సమ్మేళనాలు, ఇతర కార్యక్రమాలు, ,18న క్విజ్, క్రీడల పోటీలు, 19న దిశా చట్టం, మహిళా సాధికారితపై విద్యార్థినులకు ప్రత్యేక చర్చ గోష్టి నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న వారోత్సవాల ముగింపు సభలో పోటీల్లో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూళ్ల సొసైటీ అధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి సూర్యకుమార్, పుప్పాల బుజ్జి పాల్గొన్నారు.

చింతలపూడి : విజ్ఞానం పెంపొందించుకోవటానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయం వద్ద జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, రాజ్‌ప్రకాష్, అలవాల బాబు, ఆత్కూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మండవల్లి : విజ్ఞానం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని తహశీల్దార్ జనార్ధనరావు అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని అన్నారు. పుస్తకాలను నిత్యం చదువుతుండం వల్ల విజ్ఞానం మరింత రెట్టింపు అవుతుందన్నారు. గ్రంథాలయాల ద్వారా పెంపొందించుకున్న విజ్ఞానాన్ని ఉపయోగించి పోటీ పరీక్షల్లో సత్తా చాటి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రంథాలయాల్లో వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పర్వీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, సిహెచ్.సుభాషిని, ఎ.అనురాధ, సిహెచ్.శ్రీదేవి, జి.దుర్గమ్మ, విఆర్‌ఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లైబ్రరీ కమిటీ ఛైర్మన్ మేకల అన్నవరం అన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వారోత్సవాల్లో ఆరు రోజుల పాటు వివిధ పోటీలను విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు కొయ్యలగూడెం లైబ్రేరియన్ యు.రాముడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ పాల్గొన్నారు.